# చెస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందుతుంది

- రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్
- ఆలిండియా ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు ప్రారంభం
- రెండు దేశాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి 260 మంది క్రీడాకారులు హాజరు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్, పక్కన పోటీల నిర్వాహకులు, తదితరులు

కొత్తపల్లి, అక్టోబర్ 17: చదరంగం క్రీడతో విద్యార్థుల్లో నైపుణ్యం, మేధోశక్తి, ఏకాగ్రత పెంపొందుతుందని రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా ఫిడే రేటింగ్ ఓపెన్ చదరంగ పోటీలను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ, విద్యార్థి దశలో చదరంగ క్రీడలో శిక్షణ పొందితే జీవితంలో నిబద్ధతను సాధించవచ్చన్నారు. జిల్లాలో ఆలిండియా ఫిడే చదరంగ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. మరో అతిథి కన్న కృష్ణ మాట్లాడుతూ, చదరంగంతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. విద్యార్థి దశలో మానసికంగా క్రమశిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. పోటీల నిర్వహణ కార్యదర్శి, విశ్వనాథ్ చెస్ అకాడమీ డైరెక్టర్ అంతగిరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఈ పోటీలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ 20 వేలు, తృతీయ బహుమతి రూ. 15 వేలు, పలు విభాగాల్లో విజేతలకు మొత్తం రూ. 2 లక్షల నగదు బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్బిటర్‌గా హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ ఆర్బిటర్ ఆర్ చంద్రమౌళి వ్యవహరిస్తున్నారు. కాగా, జిల్లాలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భారతదేశంతో పాటు మరో రెండు దేశాలు, పలు రాష్ట్రాల నుంచి 260 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. అంతర్జాతీయ ఫిడే రేటింగ్ పద్ధతిలో ఈ పోటీలను నిర్వహిస్తుండగా, ప్రతి క్రీడాకారుడు 9 రౌండ్లపాటు పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్, ఫిడే ఆర్బిటర్లు శ్రీరాం, సృజన్, నేషనల్ ఆర్బిటర్ గోపినాథ్, విశ్వనాథ మారుతి, మల్లేశం పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి పనుల పరిశీలన



గంగాధర: గట్టుభూత్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో శిక్షణ అధికారులు

గంగాధర, అక్టోబర్ 17: కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన గ్రూప్–ఏ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం గట్టుభూత్కూర్ గ్రామంలో పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో నిర్మించి ఆధునిక వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలతో మాట్లాడి ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. గ్రామంలో నడుస్తున్న పవర్‌లూమ్స్‌ను పరిశీలించి వారి జీవన స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాన్ని సందర్శించి గ్రామంలో లబ్ధిదారుల సంఖ్య, అందజేస్తున్న బియ్యం వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అధికారులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

***తాహెర్ కొండాపూర్‌లో..***

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 17: కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖలకు సంబంధించిన గ్రూప్–ఏ అధికారులు శిక్షణలో భాగంగా మండలంలోని తాహెర్ కొండాపూర్‌ను సందర్శించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవల గురించి టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అంతకు ముందుకు అధికారులకు సర్పంచ్ మడికంటి మమత, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోస్కుల శంకరయ్య, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సంపత్‌కుమార్, మడికంటి మరుతి, వారు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17: ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ రాసిన 'సంచారం సాహితీ యాత్ర' వ్యాసాల పుస్తకాన్ని మంగళవారం నగరంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, సినీనటి, రచయిత్రి కిలారి స్వర్ణ, తెరవే రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు గాజోజు నాగభూషణం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకట్ల తిరుపతి, సీవీ కుమార్, పొన్నం రవిచంద్ర, నంది శ్రీనివాస్, బూర్ల వెంకటేశ్వర్లు, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

రాంనగర్, అక్టోబర్ 17: ఎన్నికల నిబంధనల్లో భాగంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో మంగళవారం రెండు ఠాణాల పరిధిలో రూ.21 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీతారాంపూర్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న వ్యాన్‌లో రూ.19,99,804 నగదు ఆధారాలు లేకుండా తరలిస్తుండడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్ సిద్ధం శ్రీనివాస్ వద్ద డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్, ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అలాగే, వన్‌టౌన్ పోలీసులు రాజీవ్ చౌక్‌లో మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తి వద్ద రూ. లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి వివరాలు లేకపోవడంతో సీజ్ చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు.

గంగాధర, అక్టోబర్ 17: బూరుగుపల్లి శివారులో గంగాధర పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తులు ఆధారాలు లేకుండా రూ.2,80,000 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పుల్ల అభిలాష్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు నిబంధలను పాటించాలని సూచించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

రాంనగర్, అక్టోబర్ 17: తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 17 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరుచగా విద్యానగర్‌కు చెందిన మురళీకంఠం గడ్డం వార్ అనే వ్యక్తికి పది రోజుల జైలు, రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మిగితా 16 మందికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాది డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులో 43 మందికి జైలుశిక్ష పడినట్లు తెలిపారు.

## సామూహిక కుంకుమ పూజలు

రామడుగు, అక్టోబర్ 17: గోపాల్‌రావుపేట బస్టాండ్ సమీపంలో నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో మంగళవారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నిత్య జనగణమన నిర్వాహకుడు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు ఏగోలపు మల్లేశం, నేచర్ యూత్‌క్లబ్ అధ్యక్షుడు కాసారపు పరశురాములుగౌడ్, ఉపాధ్యక్షులు పైండ్ల శ్రీనివాస్, గడ్డం రత్నాకర్, సభ్యులు బుర్ర శ్రీకాంత్‌గౌడ్, కొలిపాక తిరుపతి, ఇనుగుర్తి రణధీర్, రఘువీర్, అజయ్, దాసరి అనిల్, రవిశాస్త్రి, రాజు, మహేశ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీలో చేరిన యువకులతో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, అక్టోబర్ 17: నగరానికి చెందిన బీజేపీ నాయకుడు రాయనేని శ్రావణ్‌తో పాటు 30 మంది యువకులు మంగళవారం స్థానిక మీ సేవ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాగా, వారికి బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలోకి యువత రావడం అభినందనీయమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గంగుల కమలాకర్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఉయ్యాల విజయ్ కుమార్, వంశీ, శివ, దాసరి ప్రశాంత్, దీపక్, రాజనర్సు, గౌతమ్, తిరుపతి, మల్లేశం, సాయి, అభిషేక్, భగత్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో జీకే యూత్ గౌరవాధ్యక్షుడు గంగుల ప్రదీప్, అధ్యక్షుడు వెంకట్, నాయకులు రాజుబాబు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి



ఆర్నకొండలో చెక్‌పోస్టును పరిశీలించి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

చొప్పదండి, అక్టోబర్ 17: చొప్పదండిలోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసే నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తహసీల్దార్ నరేందర్‌కు సూచించారు. మంగళవారం ఆయన తహసీల్ కార్యాలయం, ఆర్నకొండలోని చెక్‌పోస్టు, రుక్మాపూర్ సైనిక్ పాఠశాలను రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావుతో కలిసి పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రంలో నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు వసతులు కల్పించాలని సూచించారు. ఆర్నకొండ చెక్ పోస్టులో రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం రుక్మాపూర్‌లోని సైనిక్ శిక్షణ పాఠశాలను సందర్శించి, ఎన్నికలకు వచ్చే పారామిలటరీ దళాలు ఉండేందుకు పాఠశాలలోని గదులను పరిశీలించారు. ఇక్కడ సీఐ రవీందర్, ఎస్ఐ ఉపేంద్రాచారి, ఎంపీడీవో స్వరూప తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

రామడుగు, అక్టోబర్ 17: మండలంలోని గుండి గ్రామానికి చెందిన తాపీ కార్మికుడు చంద్రయ్య ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులకు మండల సుతారి సంఘం సభ్యులు రూ. 15వేలు, గోపాల్‌రావుపేట సుతారి సంఘం తరపున ఐదు వేల నగదు అందజేశారు. గ్రామ వీడీసీ చైర్మన్ గుండి ప్రవీణ్, సుతారి సంఘం మండలాధ్యక్షుడు దుర్శేటి సత్యనారాయణా చార్యులు, గోపాల్‌రావుపేట సుతారి సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులు రమేశ్, దాసరి శ్రీనివాస్, సుధాకరాచారి, చంటయ్య, శ్రీనివాస్, లచ్చయ్య ఉన్నారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

గంగాధర, అక్టోబర్ 17: నారాయణపూర్ గ్రామానికి చెందిన కళ్లెం రాజయ్య గత ఆగస్టు 8న తన ఫోన్ పోగొట్టుకుని గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసిన పోలీసులు విచారణ చేశారు. ఐఎంఈవై నంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేయగా ఫోన్ దొరికిన వ్యక్తి సిమ్‌కార్డు వేయడంతో అతని సమాచారం గంగాధర పోలీస్ స్టేషన్‌కు చేరింది. సమాచారం అందుకున్న గంగాధర పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి రికవరీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అభిలాష్ మంగళవారం రాజయ్యకు ఫోన్ అందజేశాడు. ఎస్ఐకి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, అక్టోబర్ 17: ఎస్జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు రేకుర్తిలోని తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థి హరికృష్ణ ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ సీహెచ్ సతీశ్‌రావు పేర్కొన్నారు. ఇటీవల ఇల్లంతకుంటలో జరిగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న హరికృష్ణ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం కళాశాలలో హరికృష్ణను కళాశాల డైరెక్టర్ సీహెచ్ సతీశ్‌రావు, అధ్యాపకులు అభినందించారు. అలాగే, రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో గల పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థి అశ్విత్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశ్విత్‌ను పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు వినోద్‌రావు, హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## దుర్గామాతకు బోనాలు

చొప్పదండి, అక్టోబర్ 17: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మాతా యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మంగళవారం బోనాలు సమర్పించారు. వార్డులోని మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శిక్షణ కార్యక్రమాలతో పనితీరు మెరుగు

ముకరంపుర, అక్టోబర్ 17: శిక్షణ కార్యక్రమాల ద్వారా పనితీరు మరింత మెరుగుపడుతుందని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వీ గంగాధర్ పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మార్టీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని సబ్ స్టేషన్ల ఆపేటర్లకు నిర్వహించిన సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సబ్ స్టేషన్ ఆపరేటర్‌కు శిక్షణ తప్పనిసర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, జే రాజం, కాళిదాసు, తిరుపతి, లక్ష్మీరెడ్డి, ఏడీఈలు శ్రీనివాస్, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి,పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.